నమస్తే తెలంగాణ | DISTRICT SUPPLEMENT

# నిర్మల్

గురువారం 30 నవంబర్ 2023 | THURSDAY, NOVEMBER 30, 2023 | NIRMAL | 3

# ఓట్ల పండుగ

● ఉమ్మడి జిల్లాలో పోలింగ్‌కు సర్వం సిద్ధం ● కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది, సామగ్రి




## నేడే అసెంబ్లీ ఎన్నికల సమరం

..2లో



నిర్మల్‌లో ఈవీఎంల పంపిణీ కేంద్రంలో ఎన్నికల విధులకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న సిబ్బంది



ఎన్నికల సామగ్రితో విధులకు వెళ్తున్న మహిళ ➤

మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్, ఆసిఫాబాద్, సిర్పూర్(టీ) నియోజకవర్గాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్

ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా 2,857 పోలింగ్ కేంద్రాలు.. 23,58,892 మంది ఓటర్లు.

**సమస్యాత్మక కేంద్రాలు 661..**

**అతి సమస్యాత్మక సెంటర్లు 122**

**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా** ఓట్ల పండుగకు సిద్ధమైంది. అసెంబ్లీ ఎన్నికలు గురువారం జరుగనుండగా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 2,857 పోలింగ్ కేంద్రాల్లో 23,58,892 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. పది నియోజకవర్గాలకు అధికార యంత్రాంగం ఈవీఎంలు, ఎన్నికల సామగ్రిని తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు బుధవారం సాయంత్రం తీసుకెళ్లారు. సాధారణంగా పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగనుంది. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో 5 గంటల వరకు ఉండగా.. మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో గంట ముందే ముగియనుంది. ఆదిలాబాద్ జిల్లాలో 75, నిర్మల్‌లో 229, మంచిర్యాలలో 167, ఆసిఫాబాద్‌లో 190 సమస్యాత్మక కేంద్రాలు ఉండగా.. ఆసిఫాబాద్‌లో అతిసమస్యాత్మక కేంద్రాలు 122 ఉన్నాయి. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసుల భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

- నిర్మల్, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ)

## కాంగ్రెస్‌ను నమ్మేదే లేదు



నిర్మల్ నవంబర్ 29 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పాలనలో అష్టకష్టాలు పడ్డం. కరెంట్, నీళ్లియ్యక నరకం చూపిన్రు. ఎవుసం చేసుడు మస్తు కష్టంగా ఉండే. గప్పటి బాధలు తల్సుకుంటేనే భయమైతది. మళ్లా ఎలక్షన్లు వచ్చినయి. కాంగ్రెసోళ్లు వచ్చి ఏదేదో చెబుతున్నరు. ఎవుసానికి మూడు గంటల కరెంట్ అంటండ్రు. గీ కరెంట్‌తో మూడు దొయ్యలైన పారుతయా.. అట్లనే 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోమంటుండ్రు. మరి డబ్బులెవ్వడిస్తడు. గీ మోటర్లు పెట్టుకుంటే బావుల్లో నీళ్లుంటయా.. ఊట అందుతదా.. అందరం ఒకేసారి మోటర్లు పెడితే ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవా.. ? నాకు ముజ్గి, మంజులాపూర్‌లో 6.34 ఎకరాలు ఉంది. రెండు బోర్లు ఉన్నయ్. రెండు 5 హెచ్‌పీ మోటర్లు పెట్టుకున్న. గివ్విటితో మంచిగ మళ్లు పారుతయి. సర్కారోళ్లు ఇచ్చే 24 గంటల కరెంట్‌తో రంది లేకుంట ఎవుసం చేసుకుంటున్నం. అధికారంలోకి వచ్చేందుకు అడ్డమైన మాటలు చెప్పే కాంగ్రెసోళ్లను నమ్మేదే లేదు. మేమంతా సీఎం కేసీఆర్ వెంటే నడుస్తం.- **బొడ్డు దేవన్న, రైతు, మంజులాపూర్**

# సంక్షేమమా.. సంక్షోభమా..

**ఏవైపు ఉంటారో నిర్ణయించుకోవాల్సిన సమయం ఆసన్నమైంది..**

- ఐదేండ్లు గోసపడుదామా.. సంబురంగా ఉందామా..
- ప్రగతి రథ చక్రం.. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ఆలోచించండి..
- 'వజ్రాయుధాన్ని' వినియోగించుకునే ముందు అవలోకనం చేసుకోండి..

**తెలంగాణ రాక ముందు..** కరెంట్ కోతలు, సాగు నీరుకు తీవ్రమైన కరువు ఉండేది. భూములు బీడుగా ఉండి.. సాగుపై ఆధారపడిన రైతులు, కూలీలు, వ్యవసాయాధారిత పనులు చేసే వారికి పని దొరుకక వలస వెళ్లేవారు. దినదిన గండంగా బతికేది. ఇదీ గత ప్రభుత్వ హయాంలో సంక్షోభ పరిస్థితి.. **తెలంగాణ వచ్చినంక** 24 గంటల ఉచిత కరెంట్‌తో బీడు భూములన్నీ సస్యశ్యామలం అయ్యాయి. రైతుబంధు, రైతుబీమా, సబ్సిడీపై ఎరువులు, అర్హులకు పింఛన్లు.. ఇలా ఎక్కడ చూసినా సంక్షేమమే కండ్ల ముందు కదలాడుతున్నది. పదేండ్లకు ముందు.. పదేండ్ల తర్వాత ఎంత మార్పు వచ్చిందో మీరే చూస్తున్నారు. మూడు గంటలే కరెంటిస్తామని, 10 హెచ్‌పీ మోటర్లు కొనుక్కోవాలని, ధరణిని ఎత్తేస్తామని కొందరు అంటున్నరు. అదే జరిగితే బతుకులు ఆగమైతయ్. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ దుర్భరంగా మారుతది. భూముల ధరలు ధమాల్‌న పడిపోయి మళ్లీ వలసలు పెరుగుతయ్. మీరు సంక్షేమం వైపు ఉంటారో.. సంక్షోభం కోరుకుంటారో తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. అంతా మీ చేతిలోనే ఉంది.. ఆలోచించండి నిర్ణయం తీసుకోండి..

- నిర్మల్, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ)